

'జె.ఇ.ఇ.'లో ఎన్నో మార్పులు ఉంటాయనే వదంతుల నేపథ్యంలో విద్యార్థులకు ఊరట కలిగిస్తూ నోటిఫికేషన్ ఇటీవలే వెలువడింది. పరీక్షలో మార్పులేమీ లేనందున ఇది కూడా ఐఐటీ-జేఈఈ 2007 లాగానే ఉండబోతోంది. ఇక మిగిలిందల్లా- ఏప్రిల్ 13న జరగబోయే పరీక్షకు ప్రణాళికాబద్ధంగా తయారవడమే!

# వేగానికీ విలువ!

**ఐఐటీ-జేఈఈ**



**ధాగం కృష్ణమూర్తి**
కృష్ణమూర్తి ఐఐటీ అకాడమీ

ఐఐటీ-జేఈఈ 2008లో రెండు ప్రశ్నపత్రాలుంటాయి. ఒక్కోదానికి 3 గంటల వ్యవధి. ప్రతి ప్రశ్నపత్రంలోనూ ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమాటిక్స్ విభాగాల్లో ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలుంటాయి. ఇవి ప్రతిభ, విశ్లేషణ శక్తులను పరీక్షించేలా ఉంటాయి. అందుకని విద్యార్థికి సబ్జెక్టుపై అవగాహన, వేగం, జ్ఞాపకశక్తి అవసరం. ఈ మూడింటిలో ఏ ఒక్కటి లేకున్నా విద్యార్థి వెనుకబడతాడు.

భావనలతో పాటు వేగానికి కూడా ప్రాధాన్యం పెరిగింది. గత ఏడాది ఎంతోమంది విద్యార్థులు తమ ప్రిపరేషన్ పద్ధతిని మార్చుకోనందున దెబ్బతిన్నారు. ఐఐటీ-జేఈఈ 2008 రాయబోయేవారు దీన్ని గుణపాఠంగా భావించాలి.

## రెండు పొరపాట్లు

తొందరలో విద్యార్థులు తమకు తెలియకుండానే తప్పులు చేస్తుంటారు. అప్పుడే 'నెగిటివ్ మార్కులు' తమ ప్రభావాన్ని చూపుతాయి. జేఈఈ ప్రిపరేషన్‌లో రెండు రకాల తప్పులు జరుగుతున్నాయి.

1) ప్రతిభ గల విద్యార్థులు పరీక్షను జేఈఈని మరీ ఎక్కువ స్థాయిలో అంచనా వేసుకొని అనవసరమైన సిలబస్‌ను అధికంగా చదువుతున్నారు. అత్యంత అవసరమైన ఇంటర్ సిలబస్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనివల్ల విషయ పరిజ్ఞానం పెరుగుతుందేమో కానీ మౌలికాంశాలపై అవగాహన పెరగదు. అందుకనే సులువైన ప్రశ్నలు వచ్చినపుడు సాధించలేక వీరు నష్టపోతున్నారు.

2) ఆబ్జెక్టివ్ పద్ధతి అనగానే ఎంసెట్ మాదిరిగా ఉంటుందని భ్రమపడుతున్నారు. చదివిన భావనలను అనువర్తింపజేసే ప్రశ్నలను సాధన చేయకుండా కొన్ని పుస్తకాల్లోని ప్రశ్నలను జవాబులతో సహా బట్టీ పడుతున్నారు. ఇలా చేయటం వల్ల ఏ మాత్రం లాభం ఉండదు. ప్రశ్నలు ఆబ్జెక్టివ్‌వే అయినా వాటిని మార్కెట్లో దొరికే పుస్తకాల నుంచి యథాతథంగా తీసుకోరు.

భావనల పేరుతో భయపెట్టి సాధన పేరుతో సమయాన్ని వృథా చేసే కోచింగ్ సెంటర్లకు దూరంగా ఉండటం శ్రేయస్కరం.

## విద్యార్థులు ఏం చేయాలి?

- దాదాపుగా ఇంటర్మీడియట్ సిలబస్‌లోని పాఠ్యాంశాలే ఐఐటీ-జేఈఈ సిలబస్‌లో ఉంటాయి. కాబట్టి ఇంటర్ సిలబస్‌పై పట్టు సాధించటం ముందుగా చేయాల్సిన పని.
- తర్వాత మౌలికాంశాలపై ఆధారపడిన ఆబ్జెక్టివ్ ప్రశ్నలను వేగంగా చేయటం సాధన చేయాలి.
- ప్రశ్న ఎంత సులువుదైనా దాంట్లో ఒక చిక్కుముడి ఉంటుంది. దాన్ని సాధించడానికి మౌలికాంశాలపై అవగాహన ఉండాలి.
- కొన్ని స్టెప్స్ తప్పకుండా రాయాల్సి వుంటుంది. ఈ స్టెప్స్ వేగంగా రాయగలిగినవారే ఎక్కువ ప్రశ్నలు సాధించగలుగుతారు.
- ఎక్కువ సమయాన్ని తీసుకునే నాన్ ఆబ్జెక్టివ్ ప్రశ్నల జోలికి పోకుండా చిన్న చిక్కుముడి ఉన్న ఆబ్జెక్టివ్ ప్రశ్నలను ఎక్కువగా అభ్యాసం చేయాలి.

## బోధనకు సాధన తోడవ్వాలి

ఐఐటీ-జేఈఈలో అడిగే ప్రశ్నలు నేరుగా పాఠంలోని థియరీ రూపంలో ఉండవు. ఆ థియరీలోని భావనలను భిన్న కోణాల్లో అనువర్తించే లెక్కల రూపంలో ఉంటాయి. అందుకనే కేవలం థియరీనే పదేపదే చదవటం కాకుండా రకరకాల ప్రశ్నలు సాధన చేయాలి. వంద లెక్కలు సాధన చేసినా నూట ఒక్కో ప్రశ్న ఉంటుందన్న విషయం గమనించాలి. కాకపోతే ఆ వంద లెక్కలు సాధించిన అనుభవంతో ఆ నూట ఒక్కో లెక్కను సులభంగా చేయవచ్చు.

జేఈఈలో బోధనకూ, సాధనకూ సమాన ప్రాధాన్యం ఉంటుంది. బోధించిన భావనలు అర్థం చేసుకోకుండా గుడ్డిగా సాధన చేయడం వల్ల లాభం ఉండదు.

తరగతిలో అధ్యాపకుడు చేసిన లెక్కలను విద్యార్థి ఇంటికొచ్చాక తనకు తాను మరోసారి చేసి చూసుకోవాలి. దీనివల్ల విషయం ఎంత గ్రహించిందీ స్పష్టమవుతుంది. తర్వాత అలాంటి ప్రశ్నలనే మరికొన్నిటిని పుస్తకాల నుంచి సేకరించి సాధించాలి. దీనివల్ల అర్థం చేసుకున్న భావనలు పటిష్ఠమవుతాయి.

ఏ పుస్తకంలోనైనా జేఈఈకి అవసరమైన ప్రశ్నలెన్ని ఉంటాయో అవసరం లేనివి కూడా అన్ని ఉంటాయి. అలాంటివి గుర్తించి వాటిపై సమయం వృథా చేయకుండా ఉండాలి. చాలామంది కఠినమైన ప్రశ్నలు ముందుగా సాధించాలనే ప్రయత్నంలో విలువైన సమయాన్ని నష్టపోతుంటారు. అలా కాకుండా 'తేలిక నుంచి కఠినం' అనే క్రమంలో వెళ్ళాలి.

తోటి విద్యార్థి ఏ పుస్తకం చదివితే తానూ అదే చదవాలనే ప్రయత్నం చేయకుండా జేఈఈకి అవసరమైన పుస్తకాలనే చదవాలి.

ఎన్ని గంటలు చదివాం- అన్నదానికంటే ఎన్ని భావనలను అర్థం చేసుకున్నాం, ఎన్ని విభిన్నమైన ప్రశ్నలు సాధించాం అనేది ముఖ్యం.